

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న శ్రవణ్‌కుమార్

## మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి స్వాగతం

రామన్నపేట, జూన్ 4 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి లండన్ పర్యటన ముగించుకొని మంగళవారం తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు జగదీశ్‌రెడ్డిని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

## లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

సూర్యాపేట లీగల్, జూన్ 4 : ఈ నెల 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శనివారం జరుగనున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా న్యాయవాదులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్‌శ్రీ, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె.సురేశ్, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి డి.మల్లయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.లింగయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.



స్వామి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## మట్టపల్లి నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి, జూన్ 4 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం నృసింహుడి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మండపంలో కల్యాణం జరిపించారు. కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ పాల్గొన్నారు.



జీలుగు పైరు

## పచ్చిరొట్టతో ప్రయోజనాలెన్నో

- భూసారం పెంపు
- పెరుగనున్న పంటల దిగుబడి

మేళ్లచెర్వు, జూన్ 4 : అవగాహన లేమి, అధిక దిగుబడి సాధించాలనే ఉద్దేశంతో ప్రస్తుతం చాలామంది రైతులు రసాయనిక ఎరువులను ఇబ్బడిముబ్బడిగా వాడుతున్నారు. ఫలితంగా ఉత్పాదక వ్యయం గణనీయంగా పెరుగుతోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఏకైక ప్రత్యామ్నాయం సేంద్రియ ఎరువుల వినియోగం. పచ్చిరొట్ట పైర్లను వినియోగించుకుని భూసారాన్ని పెంచుకుని పెట్టుబడి తగ్గించుకోవచ్చు. పచ్చిరొట్ట పైర్లను రెండు సమూహాలుగా వర్గీకరించవచ్చు.

**1. పప్పు జాతికి చెందని పచ్చిరొట్ట పైర్లు :** ఇవి నేలకు కేవలం సేంద్రియ పదార్థాన్ని మాత్రమే అందిస్తాయి. ఉదాహరణకు జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు మొక్కలు

**2. పప్పు జాతికి చెందిన పచ్చిరొట్ట పైర్లు :** నేలకు సేంద్రియ పదార్థాలతో పాటు నత్రజని లాంటి మూలకాన్ని కూడా నేలకు అందిస్తాయి. ఈ పప్పు జాతి పైర్లు వాటి బుడిపెల్లో రైజోబియం వంటి బ్యాక్టీరియా సహకారంతో గాలిలోని నత్రజనిని వాటి వేరు బుడిపెల్లో స్థిరీకరింపజేస్తాయి. ఉదాహరణకు జనుము, జీలుగ, పెసర, పిల్లిపెసర, అలసందలు

**ఎప్పుడు విత్తాలి**

- పిల్లిపెసర, పెసర లాంటి పచ్చిరొట్ట పైరును మే, జూన్‌లో తొలకరి వర్షాల సమయంలో హెక్టారుకు 40–45 కిలోలు విత్తనాలను చేనులో చల్లాలి. ఈ సమయంలో భాస్వరం వంటి ఎరువులు వేస్తే పప్పుజాతి రొట్ట పైర్లు అధిక ప్రయోజనాన్ని ఇస్తాయి.
- సూపర్ పాస్ఫేట్ ఎరువును హెక్టారుకు 150 కిలోలు వేసుకోవాలి.
- పచ్చిరొట్టను నేలలో కలియదున్నే ముందు భాస్వరం ఎరువు వేసుకోవాలి.
- పైరును 6–8 వారాల వయస్సులో నేల లోకి కలియదున్నాలి. అలాచేసేప్పుడు నేలలో తేమ ఉండాలి.
- కలియదున్నాక 3–4 వారాలు మాగనివ్వాలి.

**ఇవీ ప్రయోజనాలు**

- పచ్చిరొట్ట ఎరువు చివికిన తర్వాత రసాయనిక ప్రక్రియ పెరిగి భూమి సారవంతం అవుతుంది
- భూమి భౌతిక లక్షణాలు పెరిగి భూసారం పెరగడంతో వేరు బాగా పెరిగి భూమి గుల్లబారి తేమగాలి సరైన మోతాదులో మొక్కలకు అందుతాయి.
- పచ్చిరొట్ట పైర్లు వరికన్నా నేల లోతైన భాగాల నుంచి పోషకాలను తీసుకుని వరి పైరుకు అందిస్తాయి .

### పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుంది



పచ్చిరొట్ట పైర్లు వేసుకోవడం ద్వారా భూసారం పెరిగి అధికోత్పత్తులు సమకూరుతాయి. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీతో అందిస్తున్నాం. అవసరమున్న రైతులు వారం రోజుల్లో మండల వ్యవసాయ కార్యాలయాల్లో సంప్రదించాలి.

– పెద్ది శ్రీనివాస్‌గౌడ్, ఏఓ, మేళ్లచెర్వు

## గుట్ట లక్ష్మీనరసింహుడికి సుప్రభాత సేవ



స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 4 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సుప్రభాత సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారికి సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి ఆకుపూజ నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చన చేపట్టారు. స్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.37,86,721 ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

**పట్టణ భక్తులకు గర్భాలయ దర్శనం..**

యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన భక్తులకు ఆలయ అధికారులు గర్భాలయ దర్శనం కల్పించారు. మంగళవారం తొలిరోజు 20 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర గుర్తింపు కార్డులను పరిశీలించిన అనంతరం ఆలయంలోకి అనుమతిచ్చారు. ప్రతి మంగళవారం సాయంత్రం 5 నుంచి 5:30 గంటల వరకు పట్టణానికి చెందిన భక్తులకు దర్శనం కల్పిస్తామని ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

## వైభవంగా సర్వశక్తి స్వరూపిని కల్యాణం



తాళిబొట్టు చూపుతున్న బ్రాహ్మణులు

తుర్కపల్లి, జూన్ 4 : మండలంలోని కొండాపురంలో గల శ్రీమాతా ఆశ్రమంలో మంగళవారం సర్వశక్తి స్వరూపిని మాతా, సర్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల నడుమ ముత్యాల తలంబ్రాలు పోసి కల్యాణతంతు జరిపించారు. అంతకు ముందు చండీ హోమం నిర్వహించారు. దేవతామూర్తులకు ఒడి బియ్యం పోశారు. పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో పాండురంగ ఆశ్రమం పురోహితులు అంపాల సత్యనారాయణశర్మ, గోపాలశర్మ, భావానందశర్మ, ఆలయ ధర్మకర్త తొలిచుక్క మాధవీశ్యాంకుమార్, మాజీ సర్పంచ్ సింగం వెంకటేశం, ముత్యాలు, జహంగీర్, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఇండ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

## రోడ్డు విస్తరణ కోసం ఇండ్లను తొలగించుకోవాలి

- మోత్కూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

మోత్కూరు, జూన్ 4 : మున్సిపాలిటీ కేంద్రంలో రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇండ్లను తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ పాలకవర్గం తీర్మానం మేరకు డివైడర్‌కు 40 ఫీట్ల రోడ్డు విస్తరణ చేపట్టనున్నందున యజమానులు తమ ఇండ్లను తొలగించుకోవాలన్నారు. అలసత్వం ప్రదర్శించే వారిపై మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలి

- గ్రామ భారతి కో ఆర్డినేటర్ మల్లేశ్

బొమ్మలరామారం, జూన్ 4 : రైతులు సేంద్రియ వ్యవసాయానికి అధిక ప్రాధన్యమివ్వాలని గ్రామ భారతి కో ఆర్డినేటర్ బొమ్మకంటి మల్లేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఔత్సాహిక యువ రైతులకు సేంద్రియ వ్యవసాయంపై ఆయన ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టిని రసాయనాలతో కలుషితం చేయకుండా చూసుకోవాలన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా భూసారం పెరుగడంతోపాటు పర్యావరణానికి మేలు కలుగుతుందన్నారు. ఈ నెల 7న మండలంలోని రామలింగంపల్లిలో ఐదంచెల వ్యవసాయ పద్ధతులపై క్షేత్ర సందర్శన చేసి అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రైతులు పెదద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆసక్తి గల రైతులు తమ పేర్లను 9490580766, 9291696249, 6305182620 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

## త్రోబాల్ జాతీయ పోటీలకు చిట్యాల విద్యార్థులు



సాయిజశ్విత



శ్రీజ

మోత్కూరు, జూన్ 4 : త్రోబాల్ జాతీయ పోటీలకు నల్లగొండ జిల్లాకు చెందిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పూర్ణచందర్‌రాజు, మోత్కూరు యాదయ్య తెలిపారు. మంగళవారం మోత్కూర్‌లో వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన ఎన్.సాయిజశ్విత, ఎన్.శ్రీజ ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 6,7,8 తేదీల్లో హయత్‌నగర్‌లో జరుగనున్న జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

## ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించాలి : ఎంపీఓ

ఆత్మకూరు(ఎం), జూన్ 4 : గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఇంటి పన్నుతోపాటు ఇతర పన్నులు చెల్లించి సహకరించాలని ఎంపీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో బిల్ కలెక్టర్ సుదర్శన్ పంచాయతీ కార్యాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి ఇంటి పన్నులు, దుకాణాదారుల లైసెన్స్ పన్నులు వసూలు చేశారు. ప్రజలంతా ప్రతి గ్రామంలో ఆస్తి మార్పిడితోపాటు ఇంటి నిర్మాణం కోసం గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది యాస గోవర్ధన్, బాలరాజు, హరిబాబు పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం)లో ఇంటి పన్ను వసూలు చేస్తున్న బిల్ కలెక్టర్ సుదర్శన్

## విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 4 : మండలంలోని అనంతారం గ్రామ పరిధిలోని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం పోతాయపల్లికి చెందిన నల్ల వెంకటేశ్(32) హైదరాబాద్‌లోని బీకే ఎంటర్‌ప్రైజెస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఆలయంలోని వాటర్ ప్లాంట్‌ల నిర్మాణంలో భాగంగా మెకానిక్ పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ మంగళవారం తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

రాజాపేట, జూన్ 4 : రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని మండలంలోని బొందుగుల గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బరుగు సురేశ్(32) గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 1న సురేశ్ బైక్‌పై తన అత్తగారి ఊరైన మర్యాక్‌కు వెళ్తున్న క్రమంలో మండలంలోని నర్సాపురం సమీపంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనగా సురేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

## తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్య

భువనగిరి కలెక్టరేట్, జూన్ 4 : తండ్రి మందలించాడని మనస్థాపానికి గురై కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని తాజ్‌పూర్‌లో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రం బలంగీర్ జిల్లా జర్పల్లి మండలం టీకరపాడుకు చెందిన గోపాల్‌యాదవ్.. భార్య గౌరీపోడ్, కుమారుడు వసంత్‌పోడ్‌తో కలిసి నాలుగు నెలల క్రితం మండలంలోని తాజ్‌పూర్‌కు చెందిన ఓరుగంటి రాజు వ్యవసాయ క్షేత్రంలో పని చేసేందుకు వచ్చారు. కాగా, ఏ పని చేయకుండా తిరుగుతుండడంతో తండ్రి గోపాల్ యాదవ్ కుమారుడిని మందలించడంతో మనస్థాపానికి గురైన వసంత్‌పోడ్(22) పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి గోపాల్‌యాదవ్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

## జడ్పీ నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మాణం

ఆత్మకూరు(ఎం), జూన్ 4 : జడ్పీ నిధుల నుంచి మంజూరైన రూ.16.50లక్షలతో మండల కేంద్రంలోని ఇంద్రారెడ్డి కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కాలనీ వాసులకు మంచినీటిని అందించేందుకు జడ్పీటీసీ కొడిత్యాల నరేందర్‌గుప్తా సహకారంతో మంజూరైన నిధులతో పనులు జరుగుతున్నాయి. నిధులు మంజూరు చేయించిన జడ్పీటీసీకి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



ఇంద్రానగర్ కాలనీలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్



సౌమ్య ఫ్లెక్సీకి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

## విదేశాల్లో చదివే విద్యార్థులకు అండగా ఉండాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా

యాదగిరిగుట్ట/ఆత్మకూరు(ఎం), జూన్ 4 : విదేశాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇన్సూరెన్స్ వర్తింపజేసి అన్ని విధాలుగా అండగా ఉండాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీసా పొందిన ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీతో వారిని ఆదుకోవాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లిలో ఇటీవల ఫ్లోరిడాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుడ్ల సౌమ్య కుటుంబాన్ని వారు పరామర్శించారు. సౌమ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వం, ఇతర దేశాల ప్రభుత్వాలతో మాట్లాడి ఒకసారి వీసా పొందిన విద్యార్థులకు అండగా నిలిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సౌమ్య కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, ఏశాల అశోక్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్ పాల్గొన్నారు.

అలాగే ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్లలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పల ముత్యాలు తండ్రి సాలయ్య రెండ్రోజుల క్రితం మృతి చెందగా విషయం తెలుసుకున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మంగళవారం కూరెళ్ల గ్రామానికి వెళ్లి సాలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముత్యాలుతోపాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



భూమిపూజలో పాల్గొన్న రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సభ్యులు

## రావి నారాయణరెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

భువనగిరి కలెక్టరేట్, జూన్ 4 : మాజీ ఎంపీ, పద్మవిభూషణ్ రావి నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకొని మంగళవారం మండలంలోని బొల్లేపల్లిలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జూలై చివరి నాటికి కాంస్య విగ్రహ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. విగ్రహ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా మంత్రితో పాటు ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన మహా నాయకుడు రావి నారాయణరెడ్డి అని, ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ కార్యదర్శి రావి సుఖేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పడాల భాస్కర్‌రావు, సంయుక్త కార్యదర్శి రావి హేమంత్‌రెడ్డి, కోశాధికారి తిరుమణి దాసు వెంకటేశ్వర్లు, ముఖ్య సలహాదారు భువనగిరి సత్యనారాయణ, సలహాదారు రావి ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు గడ్డం విజయ్‌భార్గవ్, కత్రోజు విజయ్‌కుమార్, సీలోజు రాజలింగం, సీలోజు లక్ష్మణాచారి, మాజీ సర్పంచ్ మద్ది బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ గడ్డమీది చంద్రకళావీరస్వామి, మాజీ జడ్పీటీసీ సందెల సుధాకర్ పాల్గొన్నారు.



గాయపడ్డ ఉజర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు

## కాంగ్రెస్ కార్యకర్తకు తీవ్రగాయాలు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 4 : పార్లమెంట్ ఎన్నికల ఫలితాల సందర్భంగా జరిగిన ప్రమాదంలో కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తకు తీవ్రగాయాలయ్యాయి. పట్టణ పరిధిలోని అరోరా కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్నికల ఫలితాల్లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మెజారిటీ వచ్చి గెలుపొందిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కౌంటింగ్ హాల్ సమీపంలో కాన్వాయ్‌తో వెళ్తున్నారు. ఈ క్రమంలో భువనగిరి పట్టణం జలీల్‌పురాకు చెందిన సోషల్‌మీడియా కార్యకర్త ఎండీ ఉజర్ కాన్వాయ్‌లోని కారును పట్టుకుని వెళ్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దాంతో ఉజర్ తలకు తీవ్ర గాయమైంది. అక్కడే ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఉజర్‌ను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలుపడంతో హైదరాబాద్‌కు తరలించారు.

## కాల్వ తూముల షెటర్ల దొంగలు అరెస్ట్

నేరేడుచర్ల, జూన్ 4 : సాగునీటి కాల్వపైన ఏర్పాటు చేసిన తూముల వద్ద ఉన్న ఇనుప సామగ్రిని అపహరిస్తున్న ఇరువురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ మంగళవారం తెలిపారు. నేరేడుచర్ల మండల పరిధిలోని జాన్‌పహాడ్ మేజర్ ఎన్ఎస్పీ కాల్వ మీద గల తూములకు ఏర్పాటు చేసిన గేట్ రాడ్, షటర్లు, గేర్ బాక్స్‌లు చోరీకి గురవుతున్నాయని కెనాల్ వర్క్ ఇన్స్‌పెక్టర్ రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా మండలంలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన వేముల రాజు, వేముల శ్రీకాంత్ దొంగతనం చేస్తూ పట్టుబడ్డట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.

## 7న ఫణిగిరి ఆలయ భూముల కౌలుకు వేలం

నాగారం, జూన్ 4 : మండలంలోని ఫణిగిరి గ్రామంలో గల సీతారామచంద్రస్వామి ఆలయ భూములకు ఈ నెల 7న వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, దేవాదాయ శాఖ ఈఓ వై.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 2024–2025 సంవత్సరానికి గాను ఈ నెల 7న ఆలయ ఆవరణలో దేవాలయానికి చెందిన 105 ఎకరాలకు సంబంధించిన కౌలు కోసం వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే రైతులు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.